

కథ 2010
2

# కొత్త రంగులద్దుకున్న కల

బెజ్జారపు రవీందర్

నాటకం రిహార్సల్ రణస్థలిలోని యుద్ధనినాదాల్లా పరమ భయంకరంగా సాగుతోంది. సంభాషణలు జరుగుతుండగానే ఆ రేకులషెడ్డులో ఉన్నట్టుండి అడవులు మొలుస్తున్నాయి. మొండిగోడల ఊర్లు వెలుస్తున్నాయి. కలలు చిట్లుతున్న స్మశానపు వైరాగ్యం- అంతలోనే పసికందు నవ్వు గదినిండా వ్యాపిస్తోంది.

**జ్ఞాని 8:** ''అమాయకుడా! ఇటు రాబోకు. ఇది ఫిలాసఫర్లు, జ్ఞానుల దేశం. అన్ని సైజుల, సకల జంతు ముఖాల జ్ఞానులున్నారిక్కడ. ఒక్క గాడిద ముఖం తప్ప. నీ పసి మానవ ముఖమే అసలైన ఆపద మాకు. వెళ్లు, వెళ్లు.

''చేసిన పనులన్నింటికీ- అవి మంచివైనా, చెడ్డవైనా- మరీ ముఖ్యంగా కూడని వాటికి సిద్ధాంతాలు, సూత్రీకరణలు తయారుచేసుకొని రా. పనులేం చేయకున్నా ఫరవాలేదు. ఫిలాసఫీలు మాత్రం జేబునిండా కుక్కుకొని ఉండాలి.

''చూపులు తీక్షణంగా ఉండాలి. కనీసం దైవాంశ సంభూతుల్లా అరమోడ్పుతోనైనా ఉండాలి. గుంభనమైన సరళభాష, అదీ చాతకాక పోతే 'నావీ' భాషలాంటి కొత్త పదాడంబరమైనా ఉండాలి.

''ఇది ద్వైతం. మా సాయం లేనిదే పిడికిలెత్తడమే!? కాలు కదపడమే. నీ కళ్లలోని ఎరుపు మేం చెప్తేనే రౌద్రం అవుతుంది. కళ్లకలక అని నిరూపించగలం కూడా!

''ఇది జ్ఞానుల పోరు. యుగాంతం వరకు చర్చిస్తే గాని తేలని సమస్య.

''హమ్మా! పిడకలు, పిడికిళ్లతో ఎగేసుకుంటూ రావడమేనా? దెబ్బకొట్టామంటే నరకానికి పారిపోగలవు. సూత్రీకరణలు లేకుండా సూర్యునిలా ఉన్నా క్షమించం. గ్రహమో, ఉపగ్రహమో అయితే మరీ చికాకు. కొత్త మార్గమన్నావో కాళ్లు విరిచేయగలం. మా బాటలో నడిచావో- ఎలాగూ వీలుకాదు కాబట్టి వెక్కిరించి చంపగలం. మా హత్యలకూ ఓ థీరీ ఉంటుందిలే!...''

పోర్షన్ పూర్తి చేయకుండానే పారిపోజూశాడు సుగుణాకర్. దర్శక రచయిత (ద.ర) అతన్ని బలవంతంగా ఆపాడు. తాండవం చేశాక కూడా దుఃఖమూ, ఆగ్రహమూ తీరని శివుడిలా ఉన్నాడు ద.ర.

''ఈ వేషం వెయ్యనుగాక వెయ్యను. నిప్పులు పుక్కిట పట్టినట్టుగా ఉంది. రోజూ చచ్చి బతికి వస్తున్నా. నన్నొదిలెయ్ మహానుభావా...'' అంటూ బతిమిలాడాడు సుగుణాకర్.

ద.ర. వదలకపోవడంతో కొంత రాజీపడి-

''కొత్త పద్ధతిలో మహాభారతమన్నా వేద్దాం. కుంతిని, ద్రౌపదిని పచ్చి పచ్చిగా చూపిస్తూ...'' ప్రతిపాదించాడు సుగుణాకర్.

ద.ర.కు అతని నుండి వస్తున్నది జూడాస్ వాసనో, శకుని పరిమళమో అర్థం కాలేదు.

''మహాభారతంలో ఏం వుంది? ఇద్దరే జ్ఞానులు. కృష్ణుడు, శకుని. అందరికీ థీరీలు వీరే సమకూర్చి పెడతారు. మన నాటకంలో చూడు, బోలెడంత మంది,'' అన్నాడు ద.ర.

మృత్యువు తరుముతున్న వాడిలా, శాపవిమోచన మార్గం ఇదేనన్నట్లుగా నాటకం పూర్తి చేయడానికి శ్రమి

స్తున్నాడు ద.ర. సుగుణాకర్‌ని, మిగతా పాత్రధారుల్ని ఒప్పించేసరికి అతని పరిస్థితి కెలికిన పాత గాయంలా అయింది. మట్టిని పెకిలించి, అరవై ఏళ్లనాటి కమిలిన కలల్ని, నలభై ఏళ్లనాటి నెత్తుటి చారికల్ని చూపిస్తేగానీ వారు పాత్రలకు సిద్ధం కాలేదు.

*

రిహార్సల్ జరుగుతున్న రేకుల షెడ్డు పోతపోసిన దుఃఖంలా మారిపోయింది మళ్లీ. సకల ప్రపంచాన్ని పొదువుకున్న బాలింతలా, కాలిన వెదురు వనపు విషాద ఈలలా ధ్వనించింది.

సన్నివేశం 5: నేల నుండి నింగి కెగసిన తారలు మరీ దూరంగా ఉండడం వల్ల, తోవకానరాక తచ్చాడుతూ ఉన్నాడు 'జనం.' జనం అనేది ఒక పాత్ర పేరు. బహుశా అది బహువచనం కూడా. ఆ నాటకంలో జ్ఞాన కిరీటం ధరించని పాత్ర అదొక్కటే.

నేలలోంచి కాగడా ఒకటి సర్రుమని మొలుచుకొచ్చింది. మండుతున్న నిలువెత్తు కాగడా. చూరులోంచి ఇంద్రధనుస్సు ఒకటి కాలుతూ రంగుల్ని స్రవిస్తోంది. బహుశా అవి రెండూ అంతకుమునుపు పసి... మానవ ముఖాలు కావచ్చు. గది అంతా కమురు వాసన.

**జ్ఞాని 9:** అమరత్వం రమణీయం! ... ... ...

**జనం:** వద్దు... వద్దు... కీర్తించకు. ఇక దేశంలో జ్ఞానులు, ఫిలాసఫర్లు, కాగడాలు తప్ప మరేం మిగలవు. అది కడుపుకోత. కవిత్వ వస్తువు కాదు. ఈ కాగడాల వెలుతుర్లో కళ్లు మూసుకుని మనసారా ఏడవడం తప్ప ప్రణయ కవిత్వం చదవలేను.

**జ్ఞాని 10:** (స్వగతం) ఇన్నాళ్లూ బుకాయించాను. వెలుగురేకల స్పర్శ తాకని ఈ చీకట్లో పచ్చటి స్వర్గమేదో తయారవుతోందని నమ్మించాను. ఈ కాగడాల వెలుతురులో వంచనా ప్రపంచపు నగ్నత్వం బట్టబయలయ్యాక కాగితం, కలం దొరకట్లేదని నటిస్తే అసలుకే ఎసరు. రాయక తప్పేటట్లు లేదు.

(బయటకు) అర్హత ఉన్నదానితో ఆశీర్వదించక పోతే దేవతనైనా సరే నిలదీస్తాను. అవసరమైతే నా పీఠాన్ని తృణీకరిస్తాను.

(కాగడాల వెలుతురులో రాజీనామా లేఖ రాస్తుంటాడు. రాయడం పూర్తిచేసి మడిచి)

(స్వగతం) అమ్మా లోకమాత... జగత్తు మిథ్య. జనంగాడూ మిథ్య. సత్యమైనది నువ్వూ, నీ పీఠమూనూ. అనివార్య, నిస్సహాయ పరిస్థితుల్లో రాసిన లేఖ నిగూఢార్థం నీకు తెలియదనుకోను.

(అంటూ గాల్లోకి మొక్కి, ఒకసారి నేలమీద సాగిలపడి ప్రణామం చేసి, లేచి, రాసిన లేఖను చింపి ముక్కల్ని జేబులో వేసుకుంటాడు.)

*

వీధులన్నీ వర్షాకాలపు గోదారులై డప్పుల చప్పుళ్లతో, నినాదాల హోరుతో ప్రవహిస్తున్నాయి. సాయంకాలం సూర్యుడు అన్యమనస్కంగానే నిష్క్రమిస్తున్నాడు. ఊరికొక చావు. కూడలికొక బతుకమ్మ. కొత్త గాయపు సలపరింత. కొంత ఉత్సాహం.

శాప విమోచన రహస్యాన్ని చెప్పగలవాడి కోసం అన్వేషిస్తున్నట్లుగా గమ్యం లేని నడకతో ద.ర. బ్రాహ్మల వీధి దాటాడు. ఆలోచనల నాగబంధాన్ని విడదీయడానికి ప్రయత్నిస్తూ నడుస్తున్నాడు.

మగపిల్లల మాటల్లో అమ్మాయిల ప్రస్తావన తగ్గిపోయింది. ఫోన్లు కొత్త రాగాలు తీస్తున్నాయి. పావురాలు ప్రతిరోజూ కొత్త సందేశాల్ని మోసుకు వస్తూనే ఉన్నాయి. పెనుగులాడిన వాళ్లు, పోగుచేసుకున్న వాళ్లు, పోగొట్టుకున్న వాళ్లు, ఓటమి తప్ప గెలుపు నెరుగని వాళ్లు, విజిగీషులు, వీరులు, పిరికివాళ్లు, లోభులు, త్యాగులు... అందరూ ఒకే కలను కంటున్నారు. భవనాల్లోను, పూరిగుడిసెల్లోనూ అదే కల. అసలు అందరిదీ ఒకే కలనా? లేక కొత్త రంగులద్దుకున్న ఒక కల అందరినీ ప్రసవించిందా?

ఆలోచనల భారాన్ని వదుల్చుకోవాలన్నట్లుగా ద.ర. తల విదిలించాడు. గొప్ప ఏకత! కొంతమంది మినహాయింపు. నిద్రపోతున్నట్టు నటిస్తూ సామూహిక స్వప్నాన్ని భయం భయంగా, రహస్యంగా చూస్తూ పీడ కలలు కంటున్న వాళ్లను తలుచుకున్నాడు ద.ర.

కమాను చేరుకున్నాడు ద.ర. ఊళ్లో కొత్త జ్ఞాపక చిహ్నాలు ఏర్పడ్డాయి. కొన్ని పేర్లూ మారాయి. ఇది కాంతిని ఖననం చేసిన చోటు. ఇది పిల్లంగోవి నిలువునా మండిన చోటు. ఇది శివసత్తులు శివాలెత్తిన కూడలి. ఇది బతుకమ్మల చౌరస్తా. ఈ రోడ్డొక గొప్ప పిక్నిక్ స్పాట్. అక్కడున్నది లాఠీలు విరిగిన చోటు. ఇటువైపు తూటాలు పేల్చిన ప్లేసు. రోము, గ్రీకు, ఇరాకుల్లో కూడా ఇన్ని చారిత్రాత్మక ప్రదేశాలు ఉండకపోవచ్చు అనుకున్నాడు ద.ర.

చీకటి పడుతోంది. ఊరు దాటాడు. పాతకాలం నాటి 'సప్నోంకి బాగ్' అని పిలవబడే పూలతోటలోకి ప్రవేశించాడు ద.ర. ప్రస్తుతం అక్కడ పూలమొక్కలు లేవు. విస్తారంగా ఊడలు దిగిన మర్రిమాను ఉంది.

ఇక్కడే తాను 'జనం' అనే మట్టిమనిషిని కలుసుకున్నాడు. నాటకంలోకి అతన్ని ప్రవేశపెట్టాలనుకున్నది కూడా అప్పుడే. ఈ తోట గురించి 'జనం' పదేపదే బాధతోనూ మురిపెంగానూ ఒక కథ చెప్తుంటాడు.

ఒకానొకప్పుడు ఒకామె ఉండేదట. ఆమె అందచందాలు... నగలు, నట్రా చూసి అసూయపడిన సవితి ఆమెను బందిఖానాలో పెట్టింది. ఆమె కొడుకులు, కూతుళ్లు ఎంత ప్రయత్నించినా విడిపించలేకపోయారు. వాళ్ల కులగురువు ఒక ఉపాయం చెప్పాడు. సవిత్తల్లి ప్రాణం రుధిరవర్ణ పూలలో ఉందని, వాటిని చూస్తే చాలు హరీ మంటుందని!

పిల్లలందరు కలిసి ఆ పూలవిత్తనాలు చల్లారు. సవిత్తల్లి మంత్రాల వల్ల అవి మొలకెత్తలేదు. విసిగిపోయిన పిల్లలు సుమారు మూడువందలమంది మట్టి పాత్రిళ్ల లోకి వెళ్లి తమ ఎముకల్ని ఎరువుగా, రక్తాన్ని నీళ్లుగా మార్చి విత్తనాలను మొలకెత్తించారు. పరమ బీభత్సమయిన, అతి మనోహరమైన ఎర్రనిపూలు పూశాయి. కాని అంతలోనే విచిత్రం ఒకటి జరిగింది. పిల్లలు గెలవగలరని ముందే ఊహించిన సవిత్తల్లి పూల విత్తనాల్లో మర్రి విత్తనం ఒకటి కలిపి ఉంచింది రహస్యంగా. మర్రి సరసర మొలకెత్తి ఎదిగి క్షణంలోనే మానై ఊడలు దింపి తోటంతా కమ్మేసింది. దాంతో పూల మొక్కలు బతకలేదు. ఆమె ఇంకా బందిఖానాలోనే వుంది. ఇప్పటికీ రాత్రిపూట అప్పుడప్పుడు తోట పరిసరాల్లో సంకెళ్ల చప్పుడు వినిస్తుంటుందని 'జనం' చెప్పాడు.

విషాదాంత కథ. విన్నప్పుడల్లా దుఃఖంతోనూ, బాధతోనూ గుండె ఆగిపోయినట్లనిపిస్తుంది. కళ్లు తుడుచుకున్నాడు ద.ర.

కూర్చుని మట్టిని ప్రేమగా నిమురుతూ తనలో తానే మాట్లాడుకోవడం మొదలుపెట్టాడు. మాట్లాడుతుండగానే కునుకు పట్టింది. ఎంతోసేపటికిగాని మెలకువ కాలేదు.

*

ఊరు ఊరంతా యుద్ధ శిబిరంలా ఉంది. గుడారాలమయం. ఆకలి అసహనంగా రూపాలు మార్చుకొంటోంది. ఎటు చూసినా పాటల తోరణాలు రెపరెపలాడుతున్నాయి. సందిగ్ధం- ఆశ- అబార్షన్- కొన ఊపిరి.

కండువాలన్నీ ఇష్టంగానూ, అయిష్టంగానూ, నిజంగానూ, స్వార్థంగానూ పెనవేసుకుపోయి ఒకే జెండాగా ఎగురుతున్నాయి. కళ్లలోని కాంతులు రాత్రుల్ని లేతగా వెలిగిస్తున్నాయి. పూర్వీకుల ఆత్మలు ఆవహించని దేహం లేదు. పూనకాలు రాని మనిషి లేడు. సాయుధులు కానివారు లేరు. సన్నద్ధులు కానివారు లేరు.

నాటకం కాగితాల కట్ట పట్టుకుని రిహార్సల్ షెడ్డు వైపు బయలుదేరాడు ద.ర. దారి పొడవునా పగిలిన కలల ముక్కల్ని ఏరుకుంటూ- అవి తన పది సన్నివేశాల నాటకంలో ఎక్కడైనా పొదుగుతాయేమోనని తరచి చూసుకుంటూ.

**సన్నివేశం 6:** జ్ఞానులకు జనం అప్పీల్- చర్చలు.

**జనం:** అయ్యా! జ్ఞానులూ... ఇది అంతిమ యుద్ధం. శరం సంధించనక్కర లేదు. పాండవ మధ్యముడి వింటినారీ ఝుంకారం చాలు. అంబ పలుకుతుంది. జగదాంబ దిగి వస్తుంది. జమ్మిచెట్టు మీది, ఆయుధాలు దింపటానికి ఎంటికలు నెరిసినోళ్లు, మీసాలు రానోళ్లు, పాలు మరిచినోళ్లు, ఆడోళ్లు, మొగోళ్లు... అందరూ సిద్ధం... మీరు తప్ప. మీరొక చేయి వేయండి. విజయం మీ చేతుల్లో పెడతాం.

**జ్ఞాని 6:** అంతా కన్ఫ్యూజన్. నువ్వూ, నీ మాటలు మరీనూ. నీ ఆశయం సందిగ్ధం, సందేహాస్పదం.

**జనం:** సందిగ్ధం భవిష్యత్తు గురించే. ఆశయం నిస్సంశయం. గాయపడ్డా సరే, ఆకుపచ్చని కలలు కంటున్నాయి ఆవులు. నెత్తుటి స్వప్నాల వైపు వాటి కొమ్ముల్ని నెట్టకండి.

**జ్ఞాని 11:** నాకూ గాయాలున్నాయి. అవీ కలలు కంటాయి. కాని మరే... జనంగారండీ, మిమ్మల్ని మొట్టికాయలు వేసీ వేసీ అలవాటైపోయింది. కొట్టే బాధ నాకు, తినే హాయి నీకు లేకుండా ఉండలేం. నేను పెట్టిన వాతలే లేకుంటే నువ్వు దిగంబరం. కృతఘ్నుడా...

**జ్ఞాని 12:** ఘ్రాణ సిద్ధాంతకర్తను. అవినీతి ఎక్కడున్నా పసిగడతాను.ఒరేయ్ జనం, మీది దొంగజ్ఞానుల ముఠా. ఒక్కొక్కడి చిట్టా విప్పమంటావా? నీతిలేని జాతి గొడవ.

**జ్ఞాని 6:** చాల్లే. జగానికి తెలుసు నీ ప్రతిభ. మీరంతా బహు దేవతారాధకులు. అది మధ్యంతరాలకు ఒక్కరే ఆదిదేవత. అమ్మలగన్నయమ్మ చాలా పెద్దమ్మ. అమ్మగారికి, జనంగాడికి మధ్య- అనుసంధానకర్తను, అంబికా అగరుబత్తిని.

అమ్మకన్నీ వదిలెయ్. యుద్ధ శిబిరాలు మూసెయ్. డేరాలు ఎత్తెయ్. నీలి కలల్లో నిరంతరం

జోగు. 56 సార్లు శాంతి మంత్రం శ్రద్ధగా పఠించు. అన్నీ అనుకూలిస్తాయి.

**జ్ఞాని 5:** వద్దు... మిత్రమా వద్దు... వేటకు, వేటకు మధ్య అహింసావాదిలా ఉండే సింహంలాంటిదే శాంతి. ఫక్తు మాంసాహారి. అదొక ఆక్టోపస్. అజీర్తి ఎరుగని అనకొండ. అది మట్టి మనుషుల్నే కాదు, ఒళ్లంతా చేతులు ఉన్నవాళ్లని, పుస్తకాల్ని, కలల్ని, కలాల్నీ ఇష్టం గా తింటుంది. వాడి మాటలు నమ్మకు.

ఖండిత చేతులు సైతం పిడికిళ్లను కలలు కంటున్న రోజుల్లో ఎత్తిన పిడికిలి దించకు. అగ్నిపర్వ తాల్ని దాచుకున్న పిడికిలిని వారి ముందర విప్పకు. చేయి సాచకు. పాతాళంలోకి లాగి లాగి మరీ అరచేతి లో వైకుంఠం చూపిస్తారు.

నన్ను మాత్రమే నమ్ము. నిన్ను రగిలిస్తాను. వెలిగిస్తాను.

**జ్ఞాని 4:** అవును. అతడు చెప్పిన మాటలు నిజం. కానీ పిడికిలి ఎత్తిన చేయి ఉంది చూశావూ- అది 83 డిగ్రీల కోణంలో వంగి ఉంది. ఇంకా 6 డిగ్రీల ఎడం వైపుగా వంచు. వేళ్లను ఇంకొంచెం శాస్త్రబద్ధంగా బిగించు.

**జ్ఞాని 8:** నేను మాత్రం నీ వెంట రాలేను. నీతో పేచీ ఏమీ లేదనుకో. నీ చుట్టూ ఉన్నారే- జ్ఞానులు... అడుసు తొక్కినవాళ్లు, గడుసువాళ్లు, సొల్లుగాళ్లు, బొర్రలున్నవాళ్లు, పిర్రలున్నవాళ్లు, అస్థిపంజరాల నిచ్చెన తయారుచేస్తున్న వాళ్లు, కాళ్లు లాగేవాళ్లు, పీక పిసికే వాళ్లు, రెండు నాలుకల వాళ్లు... ... ... ఇదంతా వొర్తి వెధవల ప్రపంచం- నువ్వూ, నేను తప్ప. నీతో కలిస్తే వాళ్లు బలుస్తారేమోనని భయం నాకు.

చెప్తున్నానని కాదుగానీ, సరళరేఖల్ని కలగనాలి మొదట.

**జనం:** కలలు కనడం మొదటిసారి కాదు. కలల విచ్ఛిత్తీ కొత్తగాదు. మృత శిశువులూ అనుభవం నాకు. పెరిగి చేతికొచ్చిన వాళ్లూ ఉన్నారు. దారి తప్పినవాళ్లూ ఉన్నారు. అట్లని కలలు గనడం మానేస్తే, అడుగు లేయడం ఆపేస్తే అంతరించి పోతాను.

బాంచెను కాల్మొక్త అన్నోన్నే, వడిసెల రాళ్లతో బందూకుల గుండెలు బద్దలు కొట్టినోన్నే, మీ ఇక మతులతోనే కొంత పరేషానీ!

జ్ఞానభారంతో వంగిపోతున్న మిత్రులూ- నాతో కలవండి. నా ముందో, వెనుకో, పక్కలకో ఊతంగా ఉండండి. లేదా ఎదురుగా నిలవండి. అయినా అడుగు కదపని, నోరు మెదపని పరమ పవిత్రుల తోటి, జ్ఞాన సంపన్నులతోటి నాకేమిటి పని. ఇది పోరు. పుండా కొరైనా సరే, రణన్నినాదం చేస్తే గుండెల కదుము కుంటాను.

తరువాతి యుద్ధం మాత్రం వాడితోటే...!

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 14 ఫిబ్రవరి 2010*

